క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి

కొత్తపట్నం: ఉపాధి పనులు చేస్తూ ఉండగా ఓ మహిళ మృతిచెందింది. కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బత్తుల అంజలి (45) మంగళవారం ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లింది. పనులు చేస్తూ ఉండగా తీవ్ర అస్వస్థతకు గురైంది. 108 కు ఫోన్ చేయగా వారు వచ్చేలోపే మృతి చెందింది. విషయాన్ని ఏపీవోకు తెలియపర్చారు.

25న మండల సర్వసభ్య సమావేశం

ఒంగోలు రూరల్: రూరల్ మండలంలోని ఒంగోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 25న ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎంపీపీ పల్లపోలు మల్లిఖార్జునరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో కన్వీనర్‌గా జరగనున్న ఈ మండల సమావేశానికి ఆయా శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. సమగ్ర సమాచారంతో మండలశాఖ అధికారులు సమావేశంలో పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఒంగోలు రూరల్: రూరల్ మండలంలోని కరవది గ్రామంలో పలు ప్రాంతాలు, ఇటుక బట్టీ కార్ఖానాలు, వలేటివారిపాలెం వరకు, కరవది క్రిస్టియన్‌పేటలో సాధారణ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఒంగోలు రూరల్ విద్యుత్ ఏఈ ఆర్‌ఆర్ చెన్నారెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


మాలకొండయ్య


బొజ్జా ఆంజనేయులు

నాగులుప్పలపాడు: యూటీఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి తెలిపారు. నాగులుప్పలపాడు లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు పలు సమస్యలపై చర్చించిన అనంతరం మండల నూతన కమిటీకి జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షునిగా గుండ్లపల్లి సూర్యనారాయణరావు, అధ్యక్షునిగా మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శిగా బొజ్జా ఆంజనేయులు, సహాధ్యక్షునిగా అచ్చుకోలు శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

25న ఆ వాహనాలకు వేలం

గిద్దలూరు రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గిద్దలూరు పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 25వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు స్థానిక సెబ్ సీఐ అరుణ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడిన మొత్తం 12 వాహనాలను ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ ధాన్యం పరిశీలన

కొత్తపట్నం: ప్రకృతి కషాయాలతో పండించిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ బృందం మంగళవారం పరిశీలించింది. గుంటూరు జిల్లా నుంచి వచ్చిన టీం టీఎల్ చక్రవర్తి, డాక్టర్ రాజుగోపాల్, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1978లో రాష్ట్ర ప్రభుత్వం 36 ఎకరాల్లో 64 మందికి ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున ఇచ్చిందని, దానిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నామని వివరించారు. కషాయాలు సొంతగా తయారు చేసుకుని సాగు చేస్తున్నామని చెప్పారు. దేశీ విత్తనాలు ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసి నూరు శాతం కషాయాలతో పిచికారి చేసి సాగు చేస్తున్నామని రైతులు వివరించారు. ప్రకృతి కషాయాలతో పండించిన ధాన్యాన్ని ముందు మీరు తినాలని, మిగిలిన ధాన్యాన్ని అమ్ముకోవాలని బృంద సభ్యులు సూచించారు.

నైపుణ్యతతో కూడిన ప్రకృతి వ్యవసాయం చేయాలి

నైపుణ్యతతో కూడిన ప్రకృతి వ్యవసాయం చేయాలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం టీఎల్ చక్రవర్తి అన్నారు. రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ స్థాయిలో సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే చిన్న, సన్నకారు రైతుల అనుభవాలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకుకూరలు, కూరగాయలు తింటున్న వినియోగదారుల వివరాలు తెలుసుకున్నారు. మహిళా సంఘ సభ్యులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డ్వాక్రా గ్రూపు సంఘాలతో సమావేశమై సాగు సూచనలు, సలహాలు వివరించాలన్నారు. వీవోఏలు కూడా ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు రెడ్డప్ప, నరసింహులు, అపర్ణ, వీరమ్మ, ఎల్–2 మల్లీశ్వరి, ఝాన్సీలక్ష్మి, ఐసీఆర్పీలు హాజరయ్యారు.


ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ బృందం

మాతృభాష కమ్మనైనది

నాగులుప్పలపాడు: అన్ని భాషల కంటే అమ్మ భాష చాలా కమ్మనైనదని రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్, సామాజిక సేవా కార్యకర్త తెగలతోటి శ్యామ్యూల్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఉప్పుగుండూరులోని గ్రంథాలయం కూడలిలో తెలుగు భాష దినోత్సవాన్ని విద్యార్థులచే నిర్వహించారు. తెలుగు అక్షరమాల చేతపట్టి తెలుగు భాష కోసం కృషి చేసిన మహనీయుల ఫొటోలతో అమ్మ భాష కమ్మనైనది అనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

మాతృభాషను మరవవద్దు

ఒంగోలు టౌన్: పరభాష మోజులో మాతృభాష తెలుగును మరచిపోవద్దని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి ఆమె అధ్యక్షత వహించారు. మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మాతృభాషపై మరింత పట్టును పెంచుకోవాలని సూచించారు. మాతృభాష పరిరక్షణ కోసం యునెస్కో ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిందని తెలుగు శాఖాధిపతి డాక్టర్ సుభాషిణి చెప్పారు. విద్యార్థినులు బి.స్వరూప, జి.కవిత, పి.శిరీషలు తెలుగు భాష విశిష్టత గురించి చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. సభలో తెలుగు అధ్యాపకురాలు పి.యామిని అమామజీ తదితరులు పాల్గొన్నారు.


తెలుగు భాషా అక్షరమాలను ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నూరు శాతం ఇంటి పన్నుల వసూళ్లే లక్ష్యం

చీమకుర్తి: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పంచాయతీలో నూరు శాతం పన్నులు వసూలు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంతనూతలపాడు పంచాయతీ కార్యదర్శి పోతురాజు తెలిపారు. మంగళవారం సంతనూతలపాడులో ఇంటింటికీ తిరిగి ఇంటి పన్నులు వసూలు చేశారన్నారు. ప్రతి రోజు కార్యాలయ విధుల సమయానికి ఉదయం, సాయంత్రం పూట ప్రత్యేకంగా పన్నులు వసూళ్లు చేయాలని డీపీఓ సూచించిన మీదట ఇంటి పన్నులు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటి యజమానులు కూడా ఎలాంటి పెనాల్టీలు లేకుండా పన్నులు చెల్లించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.


సంతనూతలపాడులో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

వేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు


పొదిలి జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు


కాలనీ ముఖద్వారం

- ఉగాదికి గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి
- మార్కాపురం నియోజకవర్గానికి మంజూరైన ఇళ్లు 12,460
- పూర్తి అయిన ఇళ్లు 1306

తర్లుపాడు: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న గృహాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఇప్పుడిప్పుడే వారి కలలు నిజమవుతున్నాయి. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి టౌన్, పొదిలి రూరల్ మండలాల్లో మొత్తం 12,460 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో సుమారు 1306 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా వచ్చే నెలలో ఉగాది సందర్భంగా గృహ ప్రవేశాలు చేయాలని అధికారులు లబ్ధిదారులను సిద్ధం చేస్తున్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఖర్చు చేస్తోంది. ఖరీదైన స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లు ప్రతి గ్రామంలో ప్రత్యేకతను సంతరించుకుంటున్నాయి. జగనన్న కాలనీలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ఇంటి నిర్మాణానికి అవసరమైతే మరో 35 వేల రూపాయలను బ్యాంక్‌లు రుణాలుగా అందిస్తున్నాయి. మార్కాపురం పట్టణ శివారులోని ఇడుపూరు వద్ద, పొదిలి వద్ద నిర్మిస్తున్న జగనన్న లేఔట్లు ప్రత్యేక టౌన్‌షిప్‌లుగా రూపుదిద్దుకుంటున్నాయి.


తర్లుపాడులో నిర్మాణంలో ఉన్న గృహాలు

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
మార్కాపురం	1406	237
మార్కాపురం అర్బన్	6342	254
కొనకనమిట్ల	678	237
పొదిలి	2471	245
పొదిలి అర్బన్	260	41
తర్లుపాడు	1303	301

చాలా సంతోషంగా ఉంది



మాది పొదిలి మండలం మాదాలవారిపాలెం పంచాయతీలోని రామాయణకండ్రిక గ్రామం. రాష్ట్ర ప్రభుత్వం సాకారంతో జగనన్న లేఔట్‌లో ఇంటిని నిర్మించుకున్నాం. 1.50 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది సాకారంతో ఇల్లు కట్టుకున్నాం. బిల్లులు సకాలంలో వచ్చాయి. మంచి ఇల్లు కట్టుకున్నామన్న సంతృప్తి ఉంది.

– వెంకట్రావు, నందిని, దంపతులు

ఉగాదికి గృహ ప్రవేశాలు

మార్కాపురం నియోజకవర్గంలో సుమారు 1306 గృహాలు పూర్తయ్యాయి. లబ్ధిదారులకు అన్ని విధాలుగా మా శాఖ తరఫున సహకరించాం. ఉగాదికి గృహ ప్రవేశాలు చేయాలని లబ్ధిదారులు నిర్ణయించుకున్నారు. వివిధ దశల్లో ఉన్న గృహాలు కూడా త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరుతున్నాం.

– పవన్‌కుమార్, హౌసింగ్ డీఈ, మార్కాపురం



8 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న సోమరాజుపల్లి పంచాయతీ ఆవులవారిపాలెంకు చెందిన సాదం కొండయ్యను అదుపులోనికి తీసుకుని 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. బస్టాండు సెంటర్లో అక్రమ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో నిఘా పెట్టి పక్కా సమాచారంతో దాడి చేసి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మండలంలో ఎక్కడైనా బెల్టు షాపులు నడుపుతున్నా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, అక్రమ మద్యం అమ్మకాలు జరిపినా వారిపై కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. కొండయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఫిరోజ్ ఫాతిమా వివరించారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన

కందుకూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ ఉద్యోగులుపై ఆచరణ సాధ్యం కాని టార్గెట్లను విధిండాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక పోస్టాఫీస్ గేటు వద్ద ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమానికి మద్దతు తెలిపిన పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. బ్రహ్మానందం మాట్లాడుతూ పోస్టల్ శాఖలో వివిధ పథకాల పేరుతో రోజు రోజుకి పెరిగిపోతున్న మేళాలు, వాటిని ఎలాగైనా పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం వెంటనే విరమించుకోవాలని కోరారు. వాటి కోసం అధికారులు పాల్పడుతున్న అనైతిక చర్యలు, వ్యక్తిగత దూషణలను మానుకోవాలని హితవు పలికారు. ఏఐపీఈయూ గ్రూపు –సి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పిలుపు మేరకు నిరసన నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ ఎం. రాజశేఖర్, కె.కొండయ్య, చంద్రశేఖర్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

పామూరు: రాజ్యాధికారంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సామాజిక న్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా పరిశీలన, పంచాయతీల వారీగా ఓటర్ల వివరాలను సిద్ధం చేసుకోవడం, వివరాల సేకరణపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కోఆప్షన్ నాయబ్‌రసూల్, గోవిందయ్య, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, బద్దిపూడి మార్కు, బాలిరెడ్డి పాల్గొన్నారు.

బాలికా భయపడకు..!

- విద్యార్థినుల రక్షణకు ప్రభుత్వం పెద్దపీట
- గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన
- పాఠశాలలో 'భరోసా బాక్స్'ల ఏర్పాటు

చీరాల అర్బన్: ఆడపిల్లలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. ఏరంగంలో అయినా ఎక్కడైనా తమదైన ముద్రవేసి పురుషులతో సమానంగా ఉంటూ కీర్తిప్రతిష్టలు సాధిస్తున్నారు. బాలికా విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వారికి ఒక భరోసా కల్పిస్తోంది. ఏదో ఒక ప్రాంతంలో బాలికలపై లైంగిక వేధింపులు, కంటికి పాపలా కాపాడాల్సిన తండ్రే కుతూరుపై లైంగిక వేధింపులు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఆపద సమయంలో ఉన్నవారిని రక్షించేందుకు ప్రభుత్వం దిశ యాప్‌ను తీసుకువచ్చింది. మహిళలపై లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకువచ్చిన దిశ యాప్ విమర్శకుల ప్రశంసలను అందుకుంది. ఇప్పుడు పాఠశాలలోని బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించింది. వారికి భద్రత కల్పించేందుకు, స్వేచ్ఛగా పాఠశాలకు వచ్చేందుకు పాఠశాలలో 'భరోసా బాక్స్‌లు' ఏర్పాటు చేసింది. జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలలో భరోసా బాక్సులు ఏర్పాటు చేయడంతో పాటు వారికి అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, పోస్టర్లను పాఠశాలలో ఏర్పాటు చేశారు.


ఈపూరుపాలెం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భరోసా బాక్స్

చట్టాలపై అవగాహన..

పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీసులు, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి వారం నిర్దేశిత రోజుల్లో పాఠశాలలను సందర్శిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినుల ఆరోగ్యంతో పాటు వారు లైంగికంగా ఎదుర్కొనే అంశాలపై కూడా అవగాహన కల్పిస్తున్నారు. అలానే ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, దిశయాప్ ఉపయోగించే విధానం, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. బాలికా సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లతో ముద్రించిన పోస్టర్లను విద్యార్థినులు, సందర్శకులకు కనిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల డ్రాపౌట్లు, మధ్యాహ్న భోజన తనిఖీ, ఆహార భద్రత, మరుగుదొడ్లలో పరిశుభ్రత తదితర అంశాలను ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు.

అందరికీ కనిపించేలా భరోసా బాక్సులు..

- బాలికల రక్షణ, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో భరోసా బాక్సులు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. చీరాల మండలంలో మొత్తం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలు 165 ఉన్నాయి. వీటిలో భరోసా బాక్సులు ఏర్పాటు చేశారు. పాఠశాలలో హెచ్‌ఎం గది వద్ద అందరికీ కనిపించేలా ఉంచారు.
- విద్యార్థులకు ఎదురయ్యే లైంగిక వేధింపులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర సమస్యలను నేరుగా చెప్పుకోలేని వారు లెటర్ రూపంలో రాసి బాక్సులో వేయాలి.
- తాళం వేసిన బాక్సును ప్రతి 15 రోజులకు ఒకసారి ఎంఈవో పర్యవేక్షణలో మహిళా పోలీసు, ఏఎస్‌ఎం సమక్షంలో తెరిచి, అందులోని ఫిర్యాదులు, సూచనలు, సలహాలను పరిశీలిస్తారు.
- సమస్యలు, ఫిర్యాదులు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు.

అన్ని పాఠశాలలో ఏర్పాటు చేశాం..

విద్యార్థినుల రక్షణకు, భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇప్పటికే నిత్య జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో పక్కాగా భరోసా బాక్సులు ఏర్పాటు చేశాం. ప్రతి 15 రోజుకు ఒకసారి బాక్సులు తెరచి విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్నాం.

డి.నాగేశ్వరరావు, ఎంఈవో

జామాయిల్ కర్రకు మంచి గిరాకీ

- భారీగా తరలుతున్న కర్ర
- మంచి ధర లభిస్తుండటంతో రైతుల హర్షం

హనుమంతునిపాడు: జామాయిల్ కర్రకు మంచి గిరాకీ రావడంతో మండలం నుంచి భారీగా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలుతోంది. మండలంలో తువ్వ భూములున్న వేములపాడు, మహమ్మదాపురం, రాజుగారిపల్లి, ముక్కువారిపల్లి, రంగంపేట, లింగంగుంట్ల, పెద్దగొల్లపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గాయంవారిపల్లి, దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, రేణిదుపురం, హనుమంతునిపాడు, హాజీపురం తదితర గ్రామాల్లో తువ్వ భూముల్లో 15 వేల హెక్టార్లకు పైబడి జామాయిల్ తోటలు సాగులో ఉన్నాయి. గత టీడీపీ హయాంలో వర్షాలు అనుకూలించక సామాజిక వనాలు బాగా దెబ్బతిన్నాయి. జామాయిల్ సాగు చేసిన రైతులకు నష్టాలే మిగిలాయి. ఆ సమయంలో కర్ర టన్ను రూ.1000 కూడా కొనుగోలు చేసే నాథుడే కరువయ్యారు.

- గత మూడేళ్ల నుంచి వర్షాలు అనుకూలంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో సామాజిక వనాలు ఏపుగా పెరుగుతున్నాయి. జామాయిల్ కర్రకు మంచి గిరాకీ వస్తుండడంతో రైతుకు మంచి లాభాలు వస్తున్నాయి. టమోటా తోటలు సాగు సమయంలో వాసం కర్ర టన్ను రూ.4,500 ధర పలికింది. వాసం కర్ర కర్ణాటక రాష్ట్రానికి ఎక్కువగా తరలిస్తుంటారు. జామాయిల్ కర్ర బార్లు మంచి నాణ్యత ఉన్న కర్రను కోత కోసి అమ్ముతున్నారు. ముడి కర్ర బార్లు టన్ను రూ.4 వేల నుంచి రూ.4500 వరకు పలుకుతోంది. తాట తీసిన కర్ర కర్ణాటక పేపర్ మిల్లుకు తరలుతోంది. తాటతీయని ముడి కర్ర శ్రీకాళహస్తీ అట్ట తయారీ మిల్లుకు తరలుతోంది. వేములపాడు నుంచి ప్రతి రోజు 20 నుంచి 25 లారీలకర్ర వివిధ ప్రాంతాలకు ఎగుమతి అవుతోంది. టన్ను జామాయిల్ కర్ర కోత కూలీ రూ.800 ఇస్తున్నారు. జామాయిల్ కర్రకు గిరాకీ రావడంతో రైతులు మంచి లాభాలు రాబడుతున్నారు. కూలీలకు ఉపాధి దొరుకుతుంది.


వేములపాడు ప్రాంతంలో సాగు చేసిన జామాయిల్ తోటలు


లారీలకు లోడు చేసేందుకు సిద్ధంగా ఉంచిన జామాయిల్ కర్ర బార్లు


ఇతర జిల్లాలకు తరలుతున్న జామాయిల్ కర్ర

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

కందుకూరు రూరల్: వెంకటాద్రిపాలెంలో సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఐసీఏఆర్, సీటీఆర్ఐ, కేవీకే శాస్త్రవేత్తలు, ఏపీసీఎన్ఎఫ్ వారు మంగళవారం పరిశీలించారు. కేవీకే శాస్త్రవేత్త ఎస్.జ్యోతిర్మాయి, ఏపీసీఎన్ఎఫ్ ఎస్‌డీఏ వి.సునీతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో భాగంగా పరిశీలించినట్లు తెలిపారు. రైతు వెంకటేశ్వర్లు ప్రకృతి వ్యవసాయంలో మిరప, టమోటా సాగు చేస్తున్నారు. పంటలు సాగు చేసే విధానాన్ని పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. తెగుళ్లు, పురుగుల నివారించేందుకు ఎలాంటి పద్ధతులు పాటించాలో రైతుకు తెలియజేశారు. మన చుట్టూ, ఇళ్లల్లో అందుబాటులో ఉండే వాటితోనే ద్రవాలు, కషాయాలు తయారు చేసుకొని తెగుళ్లు నివారించుకోవచ్చన్నారు. దీని వల్ల భూమి కూడా సారవంతమవుతుందన్నారు. ద్రవ జీవామృతం తయారు చేసి చూపించారు. వీరి వెంట ఏపీసీఎన్ఎఫ్ ఆర్పీ పి.మాధవ, ఐసీఆర్పీ సీహెచ్.రాజా ఉన్నారు.